జాతరొస్తోంది!



తిరుపతికి జాతర కళ వచ్చేసింది. చాటింపునకు ముందే పుర వీధుల్లో డప్పుల దరువు వినిపిస్తోంది. నగరంలోని మహా శక్తి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో కరోనా కారణంగా రెండేళ్లు జాతరకు బ్రేక్ పడింది. మిగిలిన మూడేళ్లు జాతర జరిగిన తీరుపై తిరుపతి స్థానిక ప్రజల్లో విమర్శలు వినిపించాయి. వ్యక్తిగత ప్రాబల్యం పెంచుకునేందుకు జాతర సంప్రదాయాలనే మార్చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్థానిక భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఆచార సంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా వీఐపీ సారెలు, రాజకీయ వేషాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జాతరను ఘనంగా నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



పాత గంగమ్మ గుడి

తిరుపతి
ఆంధ్రజ్యోతి

కలర్‌ఫుల్ ఈవెంట్

కాలం మారినా.. నాగరికత పెరిగినా ఆనాదిగా వస్తున్న గంగజాతర్ల సంప్రదాయాలు మాత్రం సీమ జిల్లాల్లో మారలేదు సరికదా వీటిని అనుసరించి పరవశించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తిరుపతి గంగ జాతరలో ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న అధికారులు సైతం వేప మండలు కట్టుకొని, ముఖాన కుంకుమ, తెల్లని, నల్లని చుక్కలు పెట్టుకొని, నెత్తిన సున్నపు కుండలు పెట్టుకొని అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన నేటి తరం యువత సైతం గంగజాతర సమయానికి తిరుపతికి చేరుకొని రకరకాల వేషాలు వేస్తుంటారు. ఈ జాతరను ఒక కలర్‌ఫుల్ ఈవెంట్‌గా ఎంజాయ్ చేస్తారు. స్త్రీని శక్తిస్వరూపిణిగా కొలిచే ఈ జాతరలకు సీమ జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో ఇదే ఆదరణ కనిపిస్తోంది.

13న జాతర

ప్రతి ఏటా చైత్రమాసం చివరివారంలో గంగమ్మ జాతర మహోత్సవాలు వారం రోజులపాటు ఎంతో వైభవంగా జరుగుతాయి. రోజుకోవేషంతో భక్తులు చిత్ర, విచిత్రమైన అలంకారాలతో గంగమ్మను దర్శించుకుంటారు. 7వ తేది బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేది సున్నపు కుండలు వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేది మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. బుధవారం వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర పరిసమాప్తి అవుతుంది.

రాత్రి పొద్దు వాలినాకే అవిలాల సారె

పూర్వం అవిలాల చిన్న గ్రామంగా ఉండేది. 1924 నుంచి తిరుపతితో అవిలాలకు బంధం ఏర్పడింది. అవిలాల నుంచి సారెను తాతయ్యగుంట గంగమ్మకు సమర్పించడం ఆచారంగా మారింది. 1992లో సారె ఇచ్చే బాధ్యత నాకు వచ్చింది. అప్పటినుంచి నిరవధికంగా కొనసాగిస్తున్నాం. మంగళవారం మా ఊరి జాతర. అదే రోజున తిరుపతిలో ఉండే తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక పెద గంగమ్మ, అంకాళమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు ఊరి తరఫున పసుపు కుంకుమ తీసుకునేందుకు రమ్మని ఆదివారం వెళ్లి పిలుస్తా. ఆయా ఆలయాల అధికారులు, ధర్మకర్తలు వచ్చి మమ్మల్ని సారెతో తీసుకుపోతారు. అయితే ముందుటేడాది సాయంత్రం 5 గంటలలోపే తాతయ్యగుంట గంగమ్మకు సారె ఇచ్చేయాలని ఒక నాయకుడు చెప్పారు. పొద్దుపోక ముందే ఇచ్చేయడం బాగుండదని మల్లగుల్లాలు పడ్డాం. అటుఇటుగా ఒక గంట ఆలస్యం చేసి అయిష్టంగానే పంపాల్సివచ్చింది. ఈసారి సాయంత్రం 7.30 గంటలకు పైన రావాలని పిలుస్తాం.

- పెద్దిరెడ్డి, అవిలాల. గంగమ్మ సారె ఇచ్చే ధర్మకర్త

సప్పరాలు పెరగాలి



ఒకప్పుడు జాతర భారీ ఎత్తున జరిగేది. ప్రజలు ఎక్కువగా వచ్చేవారు. చాటింపు వేసిన రోజు నుంచి ఊరు వదిలివెళ్లేవారు కాదు. ప్రజలు స్వచ్ఛందంగా వేషాలు వేసేవారు. అంబలి పోసేవారు. బలులు ఇచ్చేవారు. ఊరంతా వారం రోజులపాటు సందడిగా ఉండేది. బంధుమిత్రులు వచ్చి వారం రోజులపాటు తిరుపతిలో ఉండేవారు. ఆ తర్వాత జాతరలో అనేక మార్పు, చేర్పులతో రాజకీయం ప్రవేశించింది. ప్రచారం కోసం రాజకీయ సారెలు మొదలయ్యాయి. జానపద నేపథ్యం ఉన్న జాతరను క్లాసికల్‌గా మార్చేశారు. జాతరలో ప్రజలు స్వచ్ఛందంగా వేసే పలు వేషాలు కనుమరుగు అయ్యాయి. తిరుపతి గంగమ్మ జాతరలో సప్పరాలు, మాతంగి వేషాలు ప్రత్యేకత. ఒకప్పుడు 250 సప్పరాలు వరకు భక్తులు వేసేవారు. ఒకప్పుడు తిరుమలలో సప్పరం సేవ కూడా ఉండేది. ఇప్పుడు సప్పరాలు, మాతంగి వేషాలు బాగా తగ్గిపోయాయి. వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. తిరుపతిలో 50 డివిజన్లలో ఒక్కో డివిజన్ నుంచి ఒక సప్పరం వచ్చినా పాత ఆచారం పునరుద్ధరించినట్లు అవుతుంది. జాతర నిర్వాహకులు ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నాను.

- పేట శ్రీనివాసుల రెడ్డి, రచయిత, తిరుపతి

తిరుపతిలో మొదలైన సందడి

- వైసీపీ నేతలు పాతరేసిన ఆచారాలు పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు

6న చాటింపు : ప్రతి ఏటా ఏప్రిల్ 15 తర్వాత వచ్చే తొలి మంగళవారంతో జాతర నెల మొదలవుతుంది. తిరుపతి పొలిమేర్లలో 6వ తేది మూడవ మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో గంగజాతర సంబరం మొదలుకానుంది. దీనికి ముందు ఉదయం 7 గంటలకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి అభిషేకం చేసి వడిబాల కడతారు. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన అవిలాలనుంచి తాతయ్యగుంట గంగమ్మకు సారె వస్తుంది. ఈసారెతో పాటు స్థానిక కైకాలవాళ్లు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు.



సారెల ఊరేగింపులకు చెక్

వైసీపీ హయాంలో రెండేళ్లపాటూ సారెల ఊరేగింపులకే పెద్దపీట వేశారు. ప్రతి డివిజన్ నుంచి సారెలు తేవాలని ఆ పార్టీ శ్రేణులతో పాటు అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో సంప్రదాయ జాతర పక్కదారి పట్టింది. సారె వెళ్లే మార్గాల్లో వాహనదారులకు చుక్కలు కనిపించేవి. సారెతోపాటు నాయకులు, అనుచరులు ఆలయంలోకి గుంపులుగా రావడంతో సాధారణ భక్తులు క్యూలైన్లలోనే గంటల తరబడి చిక్కుకుపోవాల్సి వచ్చేది. వీటిని దృష్టిలోపెట్టుకు సారెల ఊరేగింపుల సంప్రదాయానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. అమ్మవారికి సారెలు సమర్పించాలనుకునే గంగమ్మ భక్తులు ఆలయ కార్యాలయంలో ఇచ్చి రసీదు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నేడు నీట్ యూజీ-2025

- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష
- హాజరుకానున్న 4,489 మంది విద్యార్థులు

తిరుతి(విద్య), మే 3(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ యూజీ-2025) ఆదివారం జరగునుంది. ఎన్టీఏ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్ష ఏర్పాట్లను డీఆర్వో నరసింహులు పర్యవేక్షిస్తుండగా కేంద్రీయ విద్యాలయం-1 ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ పాండ్య నీట్ సిటీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 4,489 మంది విద్యార్థులకు తిరుపతిలో 9, గూడూరులో ఒకటి చొప్పున పది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలవద్ద పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. ఐతే ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.



జాతీయ రహదారిపై మిలటరీ వాహనాలు

ఆయుధ పరికరాలున్న సైనిక వాహనాలు ఒకదాని వెనుక ఒకటి శనివారం కోల్‌కత్తా- చెన్నై జాతీయ రహదారిపై దూసుకుపోతూ కనిపించాయి. దాదాపుగా 50 వాహనాలు ఇలా వెళ్లడంతో తడ- సూళ్లూరుపేట మధ్య ప్రజలు ఆసక్తిగా చూశారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో యుద్ధవాతావరణం నేపథ్యంలో చెన్నై వైపునకు దూసుకుపోయిన ఈ వాహనాలను చూసి ప్రజలు రకరకాల వ్యాఖ్యానాలు చేశారు.

- తడ, ఆంధ్రజ్యోతి

ఠారెత్తిస్తున్న ఎండలు

- సూళ్లూరుపేటలో 42.8 డిగ్రీలు నమోదు

తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. ఏటా మే చివరి వారం 44 డిగ్రీల వరకు కూడా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ సారి ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 11గంటలకు రోడ్డుమీదకు రావడానికి జనం భయపడుతున్నారు. ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం 5 గంటలైనా బయటకు రావడానికి జంకుతున్నారు. సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరులో శనివారం 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో 43 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం నాటి ఉష్ణోగ్రతలు.. సూళ్ళూరుపేట 42.8, తిరుపతి అర్బన్, రూరల్ 42.4, వెంకటగిరి 42.2. రేణిగుంట, సత్యవేడు, వరదయ్యపాళెం 41.7, పెళ్లకూరు 41.5, పిచ్చాటూరు 41.2, వడమాలపేట, నారాయణవనం 40.5, తడ 40.4, శ్రీకాళహస్తి, ఏర్పేడు, 40.2 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి.

డీఎస్సీలో క్రీడా కోటా 41 పోస్టులు

- క్రీడాకారులకు 35ఏళ్ల కల సాకారమైందన్న శాప్ చైర్మన్

తిరుపతి(క్రీడలు), మే 3(ఆంధ్రజ్యోతి): 'వివిధ స్థాయిల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించింది. ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో క్రీడాకోటా కింద జిల్లాలో 41 పోస్టులు కేటాయించడం ఇందుకు నిదర్శనం' అని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తద్వారా క్రీడాకారుల 35ఏళ్ల కల సాకారమైందన్నారు. తిరుపతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను శాప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలి ప్రతిపాదనగా దీనిని సీఎం చంద్రబాబు ముందుంచగా, ఆయన అంగీకరించారన్నారు. తద్వారా ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో స్పోర్ట్స్ కోటా కింది 3శాతం రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

ఆయన.. ఆమె.. చివరకు ఆయనే!

- ఎస్వీఎంసీ ప్రిన్సిపల్‌గా మళ్లీ రవిప్రభు
- రుయా సూపరింటెండెంట్‌గా రాధ



డాక్టర్ రవిప్రభు



డాక్టర్ రాధ

ఏప్రిల్ 27: తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్‌గా అక్కడి అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ రాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏప్రిల్ 30: ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ.. రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవిప్రభునే కొనసాగేలా మళ్లీ ఉత్తర్వులు వచ్చాయి.

మే 1: ఎస్వీఎంసీ ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ బాధ్యతలు కూడా స్వీకరించారు.

మే 3: ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా రవిప్రభు, రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధను నియమిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇలా, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్, రుయా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీలో గందరగోళం నెలకొంది. ఆయా పోస్టులకు సంబంధించి డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రాధ నియామకాల్లో మూడుసార్లు ఉత్తర్వులు మారాయి.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ప్రశాంతంగా మెయిన్స్ రాత పరీక్షలు

- 623 మంది హాజరు



తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. తిరుపతిలోని ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాల, ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్‌లో ఈనెల 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. తొలిరోజైన శనివారం 911 మందికి గాను 623 మంది హాజరైనట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో పరీక్షలు జరుగుతున్న తీరును కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఆయా కేంద్రాల్లో వసతులు కల్పించారు.

ఎండ.. వాన

- చల్లబడిన తిరుమల కొండ

ఒకవైపు వేసవి సెగలతో ఉడికిపోతూ ఉంటే శనివారం తిరుమల కొండమీద వాన కురవడంతో చల్లబడింది. ఉదయం నుంచీ ఎండ, ఉక్కపోతతో భక్తులు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం తర్వాత నల్లని మబ్బులు కమ్ముకుని 3.30 ప్రాంతంలో వాన మొదలైంది. దాదాపు ముక్కాలు గంటపాటు కురిసిన వానలో భక్తులు తడుస్తూ ఆనందించారు. ఆ తర్వాత చల్లటి గాలులతో తిరుమల కొండపై ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కాగా, శనివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వాహనాలే కాదు నడక దారులూ కిటకిటలాడుతూ కనిపించాయి. సర్వదర్శనానికి నేరుగా క్యూలైన్‌లో వెళ్లేవారికి 14 గంటలకు పైగానే సమయం పడుతోంది. గదులు లభించని భక్తులు వసతి సముదాయాలు, జర్మన్ షెడ్లు, చెట్ల కిందా సేద తీరుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఉదయం ఎండకు షెడ్లకిందకు చేరిన భక్తులు



మధ్యాహ్నం తర్వాత వానకు తడుస్తూ..

పీఎన్‌బీ ఏటీఎం చోరీకి యత్నం

- ముగ్గురు తమిళనాడు దొంగలను వెంటాడి పట్టుకున్న తిరుపతి పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఏటీఎం పగులకొట్టి దోపిడీకి యత్నించిన తమిళనాడుకు చెందిన ముగ్గురు దుండగులను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మైనర్లే. వీరిని వెంటాడి పట్టుకొనే క్రమంలో కిందపడిన వెస్ట్ కానిస్టేబుల్ రమేష్‌కు గాయాలయ్యాయి. వెస్ట్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. బాలాజీ కాలనీలోని పీఎన్‌బీ ఏటీఎంలో డబ్బులు అపహరించడానికి ముగ్గురు మైనర్ దుండగులు యత్నించారు. ఏటీఎంను ఇనుప రాడ్‌తో పగులగొట్టే క్రమంలో ముంబైలోని బ్యాంకు సర్వలెన్సు టీమ్ సీసీ కెమెరాల్లో గమనించారు. వారి సమాచారంతో తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం పోలీసులను అప్రమత్తం చేశారు. వెస్ట్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాత్రి గస్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్ళు బాలమురళి, మల్లికార్జున, కానిస్టేబుళ్లు రమేష్, నాగార్జున ఘటనా స్థలం వద్దకు వెళ్లారు. రక్షక్ డ్రైవర్ నరేష్, పోలీసులు వాహనం దిగగానే ప్రధాన నిందితుడు రాడ్‌తో పరుగెత్తుకుంటూ వెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. ఈ వెంటాడే క్రమంలో కింద పడిన కానిస్టేబుల్ రమేష్‌కు భుజంపై ఎముక విరగడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పట్టుబడిన ముగ్గురూ మైనర్లే. వీరు గతంలో తమిళనాడు, ఏపీలో పలు చోట్ల ఏటీఎంలు పగులకొట్టి నగదు దొంగిలించినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ అనిల్‌కుమార్, దుండగులను విచారిస్తున్నారు.



దుండగులు దోపిడీకి యత్నించిన ఏటీఎం

శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద భక్తుల మధ్య ఘర్షణ

తిరుమల, మే3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద భక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శనివారం వీఐపీ బ్రేక్ అనంతరం సర్వదర్శనాలు మొదలైన కొంతసేపటికి భక్తులు ఒకరిని ఒకరు నెట్టుకుంటూ వేగంగా ఆలయంలోకి ప్రవేశించారు. ఈక్రమంలో రెండు బృందాల మధ్య మహద్వారం వద్ద మాటామాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఇంతలో పక్కనే ఉన్న భద్రతా సిబ్బంది, ఆలయ అధికారులు జోక్యం చేసుకుని విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. స్వామి దర్శనానికి వచ్చి గొడవపడటం ఏంటని ఆలయ అధికారులు సర్దిచెప్పడంతో ఎవరిపాటికి వారు దర్శనానికి వెళ్లిపోయారు.



ఘర్షణకు దిగిన భక్తులను అడ్డుకుంటున్న భద్రతా సిబ్బంది, అధికారులు

'వాయిస్ ఆఫ్ ఉషా' ఛానల్ ప్రారంభించా!


ఆలయం ఎదుట సింగర్ ఉషా

తిరుమల, మే3(ఆంధ్రజ్యోతి): వాయిస్ ఆఫ్ ఉషా అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించినట్టు ప్రముఖ గాయని ఉషా తెలిపారు. శనివారం శ్రీవారి దర్శనం అనంతరం ఆమె తిరుమల ఆలయం ముందు మీడియతో మాట్లాడుతూ.. 'కారులో షికారు' అనే ఇంటర్వ్యూ సిరీస్ నడుస్తోందన్నారు. అలాగే 'ఇకా రికార్డు లేబుల్' పేరుతో కొన్ని పాటలు పాడుతున్నట్టు చెప్పారు. కాగా శ్రీవారిని శనివారం పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా దర్శించుకున్నారు.

తిరుమలలో 'మే ఐ హెల్ప్ యూ'



తిరుమల, మే3(ఆంధ్రజ్యోతి): తిరుమలను సందర్శించే భక్తులకు కోరిన సమాచారం ఇవ్వడానికి 'మే ఐ హెల్ప్ యూ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తిరుమల వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆలయం, అఖిలాండం, మ్యూజియం వంటి రద్దీ అధికంగా ఉండే ప్రదేశాల్లో విజిలెన్స్, పోలీసు సిబ్బంది 'మే ఐ హెల్ప్ యూ' అనే జాకెట్లు ధరించి ఉంటారని చెప్పారు. భక్తులు కోరిన సమాచారం వారు ఇస్తారని అన్నారు. 24 గంటల పాటు వీరు అందుబాటులో ఉంటారన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ, టీటీడీ సీవీఎస్వో అయిన హర్షవర్ధనరాజు ఆలోచనతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకున్నదని తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ దేవి

పాకాల, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమదేవి అన్నారు. పాకాల గ్రామ సచివాలయంలో శనివారం ఆమె అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని తెలియజేశారు. ఉపాధి హామీ పథకం గురించి వివరించారు. ఈ సదస్సులో సర్పంచ్ ఎస్.కస్తూరి, కార్యదర్శి లావణ్యలత, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, ఎస్ఎస్ఎం సలీం, గౌరీశంకరరాజు, చంద్రమోహన్, ప్రవీణ్ ప్రకాష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ సంపును పరిశీలించిన ఎమ్మెల్యే నాని



తిరుపతిరూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారం సర్కిల్లోని వాటర్ సంపును ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపును సోమవారం ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దీన్ని వినియోగంలోకి తెస్తే అవిలాల, గాంధీపురం, లింగేశ్వరనగర్, ఓటేరు, శ్రీనివాసపురం, వేదాంతపురం పంచాయతీలకు నీటిసమస్య తీరుతుందన్నారు. ఎంపీడీవో రామచంద్ర, అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, అవిలాల సర్పంచ్ వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి బాలుడి మృతి


మృతిచెందిన లీలాచంద్

పాకాల, మే 3 (ఆంధ్రజ్యోతి): సెలవుల్లో సరదాగా గడుపుదామని అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. సంఘటన మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ తువ్వచేను వడ్డిపల్లెలో శనివారం మధ్యాహ్నం జరిగింది. అరగొండ గొల్లపల్లెకు చెందిన లీలాచంద్ (8) సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో ఈత కొడుతూ మునిగిపోయాడు. గమనించిన గ్రామస్తులు పి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. బాలుడి మృతదేహాన్ని అరగొండ గొల్లపల్లెకు తీసుకెళ్లారు.

అనుమతుల్లేని నిర్మాణాలకు నోటీసులు



భవనాలకు నోటీసులు అంటిస్తున్న పంచాయతీ కార్యదర్శి జయశంకర్, యజమానులకు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి లావణ్య

తిరుపతి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం పరిధిలోని తిరుమల నగర్, మంగళం 2, సప్తగిరికాలనీ, రణధీరపురం, శెట్టిపల్లి పంచాయతీల పరిధిలో అనుమతుల్లేని భవన నిర్మాణాలకు శనివారం నోటీసులు జారీ చేశారు. గత మంగళవారం తుడా క్వార్టర్స్‌లో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనంపై నుంచి పడి ముగ్గురు తాపీమేస్త్రీలు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి అనుమతుల్లేని కట్టడాలకు నోటీసులు జారీ చేయాలని సచివాలయాల అధికారులను ఆదేశించారు. ఆ మేరకు కార్యదర్శులు అనధికార భవనాలను ఎంపిక చేసి, నోటీసులు అందిస్తున్నారు. యజమానులు అందుబాటులో లేనిచోట భవనం గోడలకు అతికిస్తున్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

● రూ.5.32 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), మే 3(ఆంధ్రజ్యోతి): ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో చిక్కి రూ.5.32 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన యువకుడు చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. గతనెల 22వ తేదీ సాయంత్రం అతని మొబైల్‌లో అనుమానిత యాప్ కనిపించడంతో తొలగించాడు. వెంటనే గ్లోబల్-ఎక్స్‌ట్రా.కామ్ అనే వెబ్‌సైట్ ఓపెన్ కావడంతో బ్రౌజర్‌ను వెంటనే క్లోజ్ చేశాడు. తర్వాత ఐసీఐసీఐ బ్యాంకు అకౌంటును చెక్ చేయగా ఐదు ఆన్‌లైన్ లావాదేవీలు జరిగినట్లు గుర్తించాడు. వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వారు అతని డెబిట్ కార్డును బ్లాక్ చేశారు. మళ్లీ అతని అకౌంటును ఫ్రీజ్ చేశారు. అయితే అంతకు మునుపే అతని అకౌంటు నుంచి రూ.5.32 లక్షలు సైబర్ నేరగాళ్లు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు.

పల్లెలపై నిఘానేత్రం

ఎర్రావారిపాళెం, మే3 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట పోలీస్ సర్కిల్ పరిధిలో 6 చోట్ల అత్యంత అధునాతన, సీసీ కెమెరాలను పోలీసులు అమర్చారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని దేవరకొండ, మారసానివారిపల్లె, రంగన్నగారిగడ్డ, ఎర్రావారిపాళెం మండలంలోని ఎల్లమంద, బోడేవాండ్లపల్లె, ఎర్రావారిపాళెంలో ఈ కెమెరాలను అమర్చారు. ఎర్రావారిపాళెం ఇన్‌చార్జి ఎస్ఐ, భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర ఈ సీసీ కెమెరా ఏర్పాట్లను శనివారం పరిశీలించారు.

రేపటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

తిరుపతిరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఈనెల 5 నుంచి 8వరకు నాలుగురోజులపాటు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. చిగురువాడ సచివాలయపరిధిలోని ఆధార్ కేంద్రంలో అవిలాల, ఆంధ్రబ్యాంక్ కాలనీ, ధనలక్ష్మినగర్, సాయినగర్-1, 2, లింగేశ్వరనగర్, శ్రీనివాసపురం, పద్మావతిపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట, తిరుచానూరు సచివాలయంలో తిరుచానూరు, యోగిమల్లవరం, చైతన్యపురం, లక్ష్మినగర్‌కాలనీ, దామినేడు, పాడిపేట, బ్రాహ్మణపట్టు, తనపల్లె, ఓటేరు, వేదాంతపురం, చెర్లోపల్లె కేంద్రంలో వెంకటపతినగర్, చెర్లోపల్లె, పుదిపట్ల, పేరూరు, హరిపురంకాలనీ, విద్యానగర్, తుమ్మలగుంట, గొల్లపల్లె, సి.మల్లవరం, పెరుమాళ్లపల్లె, ఎస్వీనగర్, మంగళం-2 సచివాలయంలో శెట్టిపల్లె, బీటీఆర్‌కాలనీ, మంగళం-1,2, తుడా క్వార్టర్స్ ప్రజలు ఆధార్ నమోదు సేవలు వినియోగించుకోవాలని కోరారు.

రేపు రూరల్ మండల సమావేశం

తిరుపతిరూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు రూరల్ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ
ఆదాయం: రూ.2.50 కోట్లు
శుక్రవారం శ్రీవారిని
దర్శించుకున్న భక్తులు: 74,344
తలనీలాలు సమర్పించినవారు: 32,169

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారిమెట్టు



శ్రీవారిమెట్టు వద్ద టోకెన్ల కోసం వేచి ఉన్న భక్తులు, స్తంభించిన వాహనాలు

● భారీ ట్రాఫిక్ జామ్
● టోకెన్లు లేక నిరాశతో వెనుదిరిగిన వేలాదిమంది భక్తులు

చంద్రగిరి, మే 3(ఆంధ్రజ్యోతి):. శ్రీవారిమెట్టు శనివారం భక్తులతో కికిటలాడింది. వేసవి సెలవుల నేపథ్యంలో ఒక్కసారిగా తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు రోజుకు మూడు వేలు మాత్రమే ఇస్తుంటారు. కాలినడకన వెళ్లే భక్తులకు త్వరగా అవుతుందని ఉద్దేశంతో ఉదయం 6 గంటలకు ఇచ్చే ఈ టోకెన్ల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వేకువజామునే శ్రీనివాసమంగాపురం చేరుకొంటారు. ఈ క్రమంలో శనివారం ఉదయం టోకెన్ల కోసం భక్తులు బారులు తీరారు. దాదాపు ఆరువేల మంది భక్తులు టోకెన్ల కోసం క్యూలో నిలుచున్నారు. టోకెన్ల కోసం భక్తులు భారీగా చేరుకోవడంతో వారిని అదుపు చేయలేక టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి భక్తులను అదుపుచేశారు. అలాగే రోడ్డులో స్తంభించిన వాహనాలను క్రమబద్ధీకరించారు. అయితే మూడు వేల టికెట్లే ఇవ్వడంతో మిగిలిన భక్తులు నిరాశతో వెనుదిరిగారు. కాగా వేసవి సెలవులు కావడంతో శ్రీవారిమెట్టు మార్గంలో ప్రతి రోజూ ఇచ్చే దర్శనం టోకెన్ల సంఖ్య పెంచాలని భక్తులు కోరుతున్నారు.

ఆటోవాలాల దోపిడీ...

ఉదయం సమయంలో టీటీడీ భక్తుల కోసం ఉచిత బస్సు ఏర్పాటుచేయలేదు. ఇదే అదునుగా ఆటోవాలాలు తమకు ఇష్టం వచ్చినట్లు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. తిరుపతిలో టోకెన్ల పంపిణీ పూర్తయితే శ్రీవారిమెట్టు వద్ద టోకెన్లు ఇస్తారని ఆటోవాలాలు భక్తులకు మాయమాటలు చెప్పి తీసుకొస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు శ్రీవారి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో ఆటోవాలాలు అడిగినంత డబ్బు ఇస్తున్నారు. టోకెన్ సమయానికి శ్రీవారిమెట్టుకు వెళితే ఒక్కో భక్తుడి నుంచి రూ.500 నుంచి వెయ్యి రూపాయాలు వసూలు చేస్తున్నారు.

అలిపిరిలో తమిళనాడు కానిస్టేబుల్ వీరంగం

● మద్యం మత్తులో పెట్రోలింగ్ వాహన డ్రైవర్‌పై దాడి ● కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు

తిరుమల, మే3(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ కానిస్టేబుల్ అలిపిరి చెక్‌పాయింట్ వద్ద మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. టీటీడీకి చెందిన పెట్రోలింగ్ వాహనడ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచాడు. పోలీసు, విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ క్లైసెల్వన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి టీఎన్ 24 బీసీ 2117 నెంబరు గల కారులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అలిపిరి తనిఖీ కేంద్రానికి చేరుకున్నారు. అయితే క్లైసెల్వన్ మద్యం సేవించినట్టు తనిఖీ చేసిన సిబ్బందికి అనుమానం రావడంతో కుటుంబ సభ్యులను మాత్రమే అనుమతించి అతన్ని వెనుక్కి పంపారు. కుటుంబ సభ్యులు తనిఖీ కేంద్రం దాటి క్లైసెల్వన్ కోసం ఉండిపోయారు. ఇంతలో పెట్రోలింగ్ వాహన డ్రైవర్ కిరణ్ సైరన్‌తో అక్కడికి చేరుకుని టోల్‌గేట్ మూసివేశామని, తిరిగి వేకువజాము రావాలని తెలిపాడు. అప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్న క్లైసెల్వన్ 'నువ్వు ఎవడ్రా చెప్పడానికి' అంటూ ఘర్షణకు దిగాడు. ఇంతలో గేటు దాటుకున్న వారి బంధువులు కూడా తిరిగి వెనక్కి వచ్చిమరీ కిరణ్‌పై దాడికి దిగారు. ఈదాడిలో డ్రైవర్ కిరణ్ కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. గొడవను గుర్తించిన తనిఖీ కేంద్రంలో ఉన్న మణికంఠ, చరణ్, సుబ్రహ్మణ్యం వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిపైనా క్లైసెల్వన్ బృందం చిందులు వేశారు. మరికొంతమంది భద్రతాసిబ్బంది సహాయంతో కిరణ్‌ను రుయా ఆస్పత్రిలో చేర్చారు. కాగా శనివారం బాధితుడు తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై క్లై సెల్వన్‌తో పాటు తమిళ్ సెల్వి అనే మహిళా కానిస్టేబుల్, భారతి మోహన్ దాడి చేసినట్టు తెలియజేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు తిరుచ్చిపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న


బంగారు తిరుచ్చిపై ఉభయదేవేరులతో దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిపించారు. వారోత్సావాల సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు మెరుగైన ఉపాధికి కృషి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేస్తోందని, యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో 2025 ఏప్రిల్ నుంచి 240 పరిశ్రమలకు గాను 212 అనుమతులు ఇచ్చామని, మరో 28 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. 31 పరిశ్రమలకు రూ.1.51కోట్లు ప్రోత్సాహకాలు అందించడానికి ఆమోదం తెలిపామన్నారు. తిరుపతిలో ప్రింటింగ్, ఫొటో ఫ్రేమ్స్, శ్రీకాళహస్తిలో కలంకారీ, నారాయణవనంలో పవర్‌లూమ్ క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కేపీ సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, అధికారులు శివకుమార్, రామకృష్ణారెడ్డి, రమణయ్య, విక్రమ్‌కుమార్‌రెడ్డి, మురళీమోహన్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎస్‌డీవోగా బాలాజీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(క్రీడలు), మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం ఇన్‌చార్జ్ డీఎస్‌డీవోగా ఎ.బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శాప్ చైర్మన్ ఎ.రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాప్ కోచ్‌లతో సమావేశమై వేసవి శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

'డాట్' కార్యాలయంపై దాడి

● శైలజా రెడ్డి, ఆమె అనుచరులపై కేసు నమోదు
● ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన ఘటనలో నిందితురాలు

తిరుపతి(నేరవిభాగం), మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని డాట్ హాలిడేస్ టూర్స్, ట్రావెల్ కార్యాలయంతో పాటు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులపై దాడి చేసిన ఘటనలో ఈస్ట్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతిలోని సెంట్రల్ పార్కులో పి.వెంకటకళ్యాణ్, సుంకర శివ మేనేజింగ్ డైరెక్టర్లుగా ఏడేళ్లుగా డాట్ హాలిడేస్ టూర్స్, ట్రావెల్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఒ.బాంధవి, ఉమ టెలికాలర్‌లుగా.. రాజమండ్రి రూరల్ కొంతమూరుకు చెందిన మహేష్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. డాట్ హాలిడేస్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన శైలజారెడ్డి దాదాపు పది మంది వద్ద భారీగా నగదు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. మూడేళ్లయినా ఉద్యోగాలు రాకపోవడంతో వారు రెండు రోజుల కిందట డాట్ హాలిడేస్ కార్యాలయం వద్దకు వచ్చి శైలజారెడ్డి గురించి అడిగారు. మీ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. ఎవరెవరు ఎంత డబ్బులు ఇచ్చారంటూ బాధితులను విచారించి తెలుసుకున్నారు. బాధితులు వెళ్లిన కొంతసేపటికి శైలజారెడ్డి అనుచరులు దాదాపు 10 మంది ఆ కార్యాలయం వద్దకు వచ్చి ఉద్యోగులను బయటకు గెంటి కంప్యూటర్లు పడేశారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకోవడంపై ఆగ్రహించి ఈ చర్యకు పాల్పడినట్లు సమాచారం. బాంధవి ఫిర్యాదు మేరకు శైలజారెడ్డితో పాటు కొంతమంది మహిళలపై కేసు నమోదు చేసినట్లు తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు చెప్పారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

● 98 మినిమం టైంస్కేల్ ఉపాధ్యాయుల వేడుకోలు

తిరుపతి(విద్య), మే 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా మినిమం టైంస్కేల్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు వారు శనివారం పాదాల మండపం వద్ద పూజలు చేశారు. అనంతరం టీడీపీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి నరసింహ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని నరసింహయాదవ్ వారికి హామీ ఇచ్చారు. సంఘం నాయకులు నాగార్జునరావు, రమేష్, శ్రీనివాసులు, కె.రమేష్, లోకనాథ్, చలపతి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై ఉద్యమించాలి


కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న నారాయణ, రామానాయుడు తదితరులు

తిరుపతి(ఆటోనగర్), మే 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దీనిపై యువతరం ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జెండా ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినపుడు ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, ఆలెక్క ప్రకారం నేటికి 22 కోట్ల నియామకాలు చేపట్టి ఉండాలని, ఇప్పటివరకు వెయ్యి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆ కోవలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా భృతి ఇస్తామని కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పాలకులు విద్యావంతులైన నిరుద్యోగులను మత్తుకు బానిసలను చేసి వేడుక చూస్తున్నారని విమర్శించారు. యువత శ్రమను కార్పొరేటర్లకు దోచి పెట్టేవిధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అవినీతిని తరిమి కొట్టడానికి సిద్ధం కావాలని కోరారు. ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, నాయకులు విశ్వనాథ్, సి.పెంచలయ్య, కె.రాధాకృష్ణ, రామకృష్ణ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతిరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్‌పల్లి సమీపంలోని యూత్ హాస్టల్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) 78వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్.చిన్నలాలప్ప విచ్చేశారు. ముగ్గురు కార్మికులకు శ్రామిక అవార్డులను, 100మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా యూత్ హాస్టల్‌కి చేరుకున్నారు. సంఘ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎల్. రత్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధర్ ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి గురించి మాట్లాడే హక్కు చెవిరెడ్డికి లేదు: టీడీపీ


చంద్రగిరిలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నాయకులు

చంద్రగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): అవినీతి గురించి మాట్లాడే హక్కు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిలకు లేదని చంద్రగిరి మండల టీడీపీ నేతలు విమర్శించారు. శనివారం చంద్రగిరి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ శివకోటేశ్వరరెడ్డి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన తనయుడు మోహిత్‌రెడ్డిలు ఇసుక, మైనింగ్‌లో దోచేశారని ధ్వజమెత్తారు. జగనన్న కాలనీలకు ఎందుకూ పనికిరాని భూములకు రూ.80 లక్షలు చెల్లించారని, తుడా చైర్మన్‌గా మొక్కలు, బెంచీల పంపిణీ, భూముల కొనుగోలు, రోడ్లు వేయడం, మెడికల్ క్యాంపుల పేరుతో తుడా నిధులను దోచేశారని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతూ పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలిచిన నెల నుంచే అవినీతి జరిగిపోతోందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీలో కోటి రూపాయల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని అయితే ఇప్పుడున్న ఫీల్డు అసిస్టెంట్లు అందరూ వైసీపీ హయాంలో నియమితులైనవారేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్‌రాయల్, తులసేశ్వరరెడ్డి, రాజులగారి వినోద్, డిష్ గోపి పాల్గొన్నారు.

రామచంద్రాపురం: టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఉపాధి హామీలో అక్రమాలు జరుగుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు గిరినాయుడు, జయచంద్రనాయుడు, కోటేశ్వరరెడ్డి, గోపాల్ నాయుడు, చిరంజీవి, జగన్ పాల్గొన్నారు.

తిరుచానూరు: తిరుపతి రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి అమిలినేని మధు టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి కూడా జరగలేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కత్తి సుధ, కిషోర్‌రెడ్డి, గోపి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాకాల: మండలంలో ఉపాధి పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని జడ్పీటీసీ పద్మజరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, టీడీపీ నాయకులు కె.సుధాకరయ్య, బి.ఈశ్వరచౌదరి అన్నారు. వైసీపీ పాలనలో టీటీడీ అంటే తిరుపతి తుమ్మలగుంట దేవస్థానంగా మార్చేశారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ, నాయకులు కె.సావిత్రి, కనకరాజ్, రెడ్డిప్రసాద్, మోహనకృష్ణ, డి.మోహన్ నాయుడు, ఎ.బాలాజీ, ఎల్.చినబాబు, భరత్ పాల్గొన్నారు.

భాకరాపేట: మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ అన్నారు.

వైభవంగా కోదండరాముని పుష్పయాగం




పుష్పాలు, పత్రాలకు పూజ చేస్తున్న అర్చకులు, అధికారులు - స్వామి వారికి పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగం కనులపండువగా నిర్వహించారు. ఏటా శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 11 నుంచి 12గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలోని ఊంజల్ మండపంలో అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరం, రోజా, తామర, కలువ, మొగలిరేకులు వంటి 12 రకాల కుసుమాలతో, ఆరు రకాల పత్రాలతో ఉత్సవర్లను అభిషేకించారు. 108సార్లు విష్ణుగాయత్రి మంత్రాన్ని పఠించి పుష్పాలకు అధిపతి అయిన పుల్లుడిని ప్రసన్నం చేశారు. ఇలా చేయడం వల్ల ప్రకృతి పులకించి ఎలాంటి వైపరీత్యాలూ తలెత్తకుండా స్వామివారు కరుణిస్తారని భక్తుల విశ్వాసం. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు 3టన్నుల పుష్పాలను విరాళంగా అందించారు. దాతలను సమన్వయం చేసి పుష్పాలను సమకూర్చిన ఉద్యానవనాధికారి శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. రాత్రి ఉత్సవర్లు మాడవీధుల్లో అంగరంగ వైభవంగా విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బి.నాగరత్న, ఏఈవో రవి, మునిశంకర్, సురేష్ పాల్గొన్నారు.

38 మందికి టీడీఆర్ బాండ్ల పంపిణీ

తిరుపతి, మే3(ఆంధ్రజ్యోతి) : మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారిలో అర్హులైన వారికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. శనివారం జరిగిన టీడీఆర్ బాండ్ల మేళాలో అర్హత పొందిన 38 మందికి పంపిణీ చేశారు. 556 మందికి బాండ్లు ఇవ్వాల్సి ఉండగా 239 మంది అర్హులను గుర్తించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. మేళాలో ఇప్పటివరకు మొత్తం 65 మందికి టీడీఆర్ బాండ్లు అందజేశామన్నారు. సోమవారం మరికొంతమందికి అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మహాపాత్ర పాల్గొన్నారు.

ప్రాక్ శాస్త్రి కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ నిర్వహించే ప్రాక్ శాస్త్రి (ఇంటర్ తత్సమాన) కోర్సు నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి టెన్త్ అర్హతగా నిర్ణయించారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేదు. దరఖాస్తులను పరిశీలించి నేరుగా అడ్మిషన్లు నిర్వహిస్తారు. దరఖాస్తుకు జూన్ 6వ తేదీ చివరి గడువుగా విధించారు. సమగ్ర సమాచారం కోసం ఎన్ఎస్‌కెటీయూ. ఏసీ.ఇన్ వెబ్‌సైట్ చూడవచ్చునని వర్సిటీ అధికారులు తెలిపారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడాకారులకు షూలు పంపిణీ చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం ఉదయం శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. వేసవి శిక్షణ శిబిరాలలో పాల్గొంటున్న 400 మంది బాలబాలికలకు షూలు, సాక్స్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలపట్ల ఆసక్తి ఉన్న వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తాజా, మాజీ డీఎస్‌డీవోలు బాలాజీ, సయ్యద్‌సాహెబ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్టి హేమంత్‌రాయల్, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ డేటా సైన్స్ విద్యార్థులకు ఇస్రోలో ఇంటర్న్‌షిప్



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో డేటా సైన్స్ చదివిన ఏడుగురు విద్యార్థులు ఇస్రో, షార్, ఎన్ఏఆర్ఎల్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక య్యారు. ఇందులో ప్రభాస్‌రాజ్, భరత్ కుమార్, వినయ్, దీప, నవ్య నిఖిత, సుమంత్, కీర్తి ఉన్నారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వారికి ఉత్తర్వులను అందించి, అభినందించారు. కాలాను గుణంగా అవసరమైన కోర్సుల నిర్వహణ పట్ల యూనివర్సిటీ శ్రద్ధ వహిస్తోందని వారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసయ్య, హెడ్ అంజనన్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డేటా సైన్స్‌లో మరిన్ని కొత్త కోర్సులు

యూఎస్ఏకి చెందిన ఎక్స్‌ప్లాయెన్స్ ఇంక్‌తో కలిసి డేటా సైన్స్‌లో మరిన్ని కొత్త కోర్సుల నిర్వహణకు అధికారులు నిర్ణయించారు. ఈ విషయమై చర్చించినట్లు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చెప్పారు. కొత్త కోర్సుల్లో పీజీ డిప్లమో ఇన్ డేటా సైన్స్ (ఏడాది కాలం), సర్టిఫికెట్ ఇన్ పైథాన్ ఫర్ ఏఐ, ఎంఎల్ అండ్ జనరల్ ఏఐ (ఆరు నెలలు), సర్టిఫికెట్ ఫర్ డేటా విజువలైజేషన్ (ఆరు నెలలు), సర్టిఫికెట్ ఇన్ క్లౌడ్ టెక్నాలజీస్ (ఆరు నెలలు) కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను కూడా వారు ఆవిష్కరించారు.

టౌన్‌క్లబ్ కూడలిలో చలువ పందిళ్లు



చలువ పందిరి కింద దాతలు

తిరుపతి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్‌క్లబ్ కూడలిలోనూ దాతలు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా సిగ్నల్స్ వద్ద వేచి ఉన్న వాహనదారుల అవస్థలను గుర్తించిన కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శి పామిడి సత్యనారాయణ, దిండికుర్తి నరసింహులు ఇప్పటికే భవానీనగర్ కూడలిలో చలువ పందిరి ఏర్పాటు చేశారు. తాజాగా టౌన్‌క్లబ్ కూడలి మూడు వైపులా అమర్చారు. శనివారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బుల్లెట్ రమణ, వెంకటరత్నం, నవీన్‌కుమార్‌రెడ్డి, వెంకటరత్నం, దంపూరి భాస్కర్ యాదవ్ ప్రారంభించారు.

దెబ్బతిన్న రోడ్లకు త్వరలో మరమ్మతులు

తిరుపతి(జీవకోన), మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దెబ్బతిన్న 22 రోడ్డు పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్ తెలిపారు. చంద్రగిరి పరిధిలో నాలుగు, శ్రీకాళహస్తి 6, సత్యవేడు 1, నగరి 3, గూడూరు 2, సూళ్లూరుపేట 4, వెంకటగిరి పరిధిలో 2 రోడ్లకు మొత్తం 57.35 కిలోమీటర్లకు త్వరలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు.

వేద వర్సిటీలో వేదం - యోగాపై శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వేదం, యోగా అంశాలపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనుంది. ఈనెల 7 నుంచి జూన్ 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం సాగనుంది. సంస్కృత భాష, సాహిత్యం, యోగాసనాలు, పూజా విధానాలు, భగవద్గీత వంటి ప్రఖ్యాత గ్రంథాలపై అవగాహన కల్పిస్తారు. సమగ్ర సమాచారం కోసం 9949191999లో సంప్రదించవచ్చునని నిర్వాహకులు ఎస్.సూర్యనారాయణమూర్తి తెలిపారు.

నీట్ యూజీ-2025 పరీక్షకు పటిష్ట చర్యలు

తిరుపతి(విద్య), మే 3(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ యూజీ-2025)లో ఎటువంటి అవకతవకలకూ ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలను మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మూసేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థుల సహాయార్థం ఉదయం పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు, సాయంత్రం తిరిగి వచ్చేందుకు ఆర్టీసీ బస్సులను నడిపేలా అధికారులు చర్యలు చేపట్టారు. దివ్యాంగ అభ్యర్థులకు సహాయకులను అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాచ్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు విద్యార్థులు తీసుకురావొద్దని అధికారులు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

పరీక్ష కేంద్రాలివే..: తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని కేంద్రీయ విద్యాలయ-1, ఎల్‌బీసీ రోడ్డులోని ఎస్వీ జూనియర్ కళాశాల, బాలాజీ కాలనీలోని శ్రీపద్మావతి బాలికల పాఠశాల, ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల కేంద్రాలుగా నీట్ పరీక్షలు జరుగనున్నాయి. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ జూనియర్ కళాశాలలోనూ పరీక్ష జరుగనుంది.

కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో తొమ్మిది కేంద్రాలు, గూడూరులో ఒక కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ప్రతి కేంద్రం వద్ద మెటల్ డిటెక్టర్లు, ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు.

వీధి వ్యాపారుల చట్టం అమలు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), మే3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి వ్యాపారులకు పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టాన్ని అమలు చేయాలని వీధి వర్తక వ్యాపార కార్మిక ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పాలక కార్యాలయం ఎదుట శనివారం వీధి వర్తక వ్యాపారులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ అధికారులు వీధి వ్యాపారులను వేధిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా చిరు వ్యాపారులను వేధించడం ఏమిటని ప్రశ్నించారు. ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ చిరు వ్యాపారులను ఆదుకోవాల్సిన అధికారులే వేధించడం న్యాయం కాదన్నారు. అనంతరం అదనపు కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఏనుగుల దాడుల పరిహారాలు ఇవ్వండి

మంగళం, మే 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో ఏనుగుల దాడుల్లో నష్టపోయిన వారికి త్వరగా పరిహారం మంజూరు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఏనుగుల దాడుల నియంత్రణకు సమర్థవంతమైన ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఏనుగుల ప్రత్యేక టాస్క్‌ఫోర్సు నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో అటవీ శాఖ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఏనుగుల దాడి నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, డీఎఫ్‌వో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఉంటాయని తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలంలో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉందని, నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితులకు రూ.40లక్షల నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని, వెంటనే క్లియర్ చేయాలని అన్నారు. పొలాలకు విద్యుత్ కంచెలను తొలగించాలని, విద్యుత్ వైర్లను పైకి ఏర్పాటు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏనుగుల మందను మళ్లించడానికి శిక్షణ పొందిన ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించుకోవాలన్నారు.

మహిళా ఆటోడ్రైవర్‌పై దాడి : ఆరుగురిపై కేసు నమోదు



రుయాలో చికిత్స పొందుతున్న భాగ్యశ్రీ

తిరుపతి(నేరవిభాగం), మే 3(ఆంధ్రజ్యోతి): మహిళా ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు.. మంగళానికి చెందిన భాగ్యశ్రీకి 23 ఏళ్ల క్రితం ప్రసన్నకుమార్‌తో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గొడవల కారణంగా 15 సంవత్సరాల క్రితం భార్యాభర్తలు విడిపోయారు. కుటుంబాన్ని పోషించడం కోసం భాగ్యశ్రీ ఆటో నడుపుకుంటోంది. ఈ క్రమంలో మంగళంలో నివసిస్తున్న బంధువు ధనకుమార్‌తో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ వ్యవహారం ధనకుమార్ భార్య మంజులకు తెలియడంతో వారిద్దరూ తరచూ గొడవపడుతూ వస్తున్నారు. గతనెల 27వ తేదీ రాత్రి 10 గంటలకు భాగ్యశ్రీ ధనకుమార్‌కు ఫోన్ చేసింది. ఈ విషయం తెలిసి మంజుల తన భర్తకు ఇంత రాత్రిలో ఎందుకు ఫోన్ చేస్తున్నావు? అని నిలదీసింది. ఇంటి వద్దకు రావాలని ధనకుమార్ చెప్పడం తో భాగ్యశ్రీ ఆమె కుమారుడు హేమంత్‌కుమార్, కుమార్తె, మరికొంత మందితో కలిసి వెళ్లింది. వెంటనే మంజుల భాగ్యశ్రీపై దాడి చేసింది. దీంతో ఇరు కుటుంబాలు వాగ్వాదానికి దిగాయి. మంజుల, ఆమె కుమారులు పవన్, రఘు, తల్లి రమాదేవి, స్థానిక టీడీపీ నేత సూరి, అతని భార్య ప్రసన్న ఇనుప రాడ్‌తో భాగ్యశ్రీ తలపై బలంగా మోదారు. ఆమె స్పృహ తప్పి కింద పడిపోయింది. వెంటనే చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. బాధితురాలి కుమారుడు హేమంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ధనకుమార్‌తో పాటు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

8న మెగా జాబ్‌మేళా



ఉద్యోగమేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీనగర్‌లోని గీతం స్కూల్‌లో ఈనెల 8వ తేదీన మెగా జాబ్ మేళా జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో కలిసి ఆయన జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీల్లో 700కు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. హాజరయ్యే యువతీ యువకులు సంబంధిత లింక్‌లో ఈ నెల 7వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8143576866, 9177508279 లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డీఐసీ జనరల్ మేనేజరు సుధాకర్, ఏపీఐఐసీ జడ్ఎం విజయభరత్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

శేషాచల కొండల్లో ఆరని మంటలు



మంగళం, మే 3(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో శుక్రవారం రాత్రి రాజుకున్న మంటలు ఆరడం లేదు. తిమ్మినాయుడుపాళెం అటవీ ప్రాంతంలో కొండకు పైభాగాన ఏర్పడిన మంటలు కరకంబాడి వైపునకు వ్యాపించాయి. శనివారం అటవీ శాఖ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎండ తీవ్రత, బోద ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. దాదాపు 60 మంది సిబ్బంది బోయర్స్, చెట్ల పంచి మండలతో అదుపు చేస్తున్నా పెద్దగా ఫలితం కనిపించడం లేదన్నారు. శనివారం రాత్రికల్లా పూర్తిస్థాయిలో అదుపు చేస్తామని తెలిపారు.

ముందు వెళుతున్న లారీని ఢీకొన్న మరో లారీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన సతీష్

నాయుడుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాదుకు చెందిన సతీష్, జ్ఞానముని లారీలో చెన్నైకు వెళుతూ విన్నమాల వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సతీష్, జ్ఞానముని లారీలో ఇరుక్కుపోయారు. వారిని స్థానికులు బయటకు తీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సతీష్(30) మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుర్రుమంటున్న సూరీడు

ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



నిర్మానుషంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు రోడ్డు

గూడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపం రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు సుమారు 38 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ చురుక్కుమంటోంది. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలోని రోడ్లు, కూడళ్లు నిర్మానుషంగా దర్శనమిస్తున్నాయి. రోడ్ల వెంబడి దుకాణాలు నిర్వహించే చిరువ్యాపారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఉక్కపోత అధికంగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

తడ మే 3(ఆంధ్రజ్యోతి): కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూళ్లూరుపేట లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సంయుక్త పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాంబట్టు అపాచీ పరిశ్రమలో కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కరీం, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నత్తం శ్రీనివాసులు, న్యాయవాదులు విజయమ్మ, చక్రవర్తి, మాలకొండారెడ్డి, హేమంత్, చలపతి, సౌమ్య సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా నీటి తొట్టెల నిర్మాణం

మూడు రోజులకే కూలిపోయిన వైనం


జార్లపాడులో కూలిన నీటితొట్టి

బాలాయపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిగిలాం పంచాయతీ జార్లపాడు గ్రామంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టి కూలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఎండల తీవ్రత దృష్ట్యా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రతి గ్రామంలో నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బాలాయపల్లి మండలంలో ఉపాధి నిధులు రూ.30 వేల వ్యయంతో ఒక్కో పంచాయతీలో రెండు, మూడు చొప్పున నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. జార్లపాడులో నిర్మించిన నీటి తొట్టె మూడు రోజులకే కూలిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో మూడు రోజులకే నీటి తొట్టె కూలిపోయిందని జార్లపాడు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సర్వీస్ రోడ్లు నిర్మించండి


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెళ్లకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు వరకు నూతనంగా నిర్మిస్తున్న సాగరమాల జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఆ ప్రాంత రైతులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన రైతులు నాయుడుపేట నుంచి చిలమత్తూరు వరకు పంట పొలాల మధ్యలో సాగరమాల రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పొలాలు రెండు భాగాలుగా విడిపోయాయని వివరించారు. దీంతో వ్యవసాయ పనులు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కామిరెడ్డి విజయసారధిరెడ్డి, గుండాల సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, కామిరెడ్డి సురేష్‌రెడ్డి, సన్నారెడ్డి, భవదీప్‌రెడ్డి, మచ్చా భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేయాలి

తడ, మే 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో వసూలుచేసే ఇంటి పన్నులను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇక నుంచి రాతపూర్వక బిల్లుల ద్వారా పన్ను వసూళ్లు చేయరాదని స్పష్టం చేశారు. సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్‌పై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు గాబ్రియేల్, మస్తాన్, పద్మా, బాబు, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు

కోట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొలకేంద్ర వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ మునిరవిచంద్రతెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గైనకాలజిస్టు రాజీనామా

కోట, మే 3 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ రూప శనివారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రెండేళ్లుగా ఇక్కడి ఆస్పత్రిలో పనిచేస్తున్న రూప పరిపాలన విభాగం ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా మెడికల్ లీవ్‌లో ఉన్న ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆ పత్రాలను ఫ్యాక్స్ ద్వారా నెల్లూరు, తిరుపతి జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులకు పంపారు. ఆమె స్థానంలో ఆస్పత్రి పరిపాలన విభాగం ఇన్‌చార్జ్‌గా అక్కడే పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యాధికారి పోతగంటి దొంప్రియరావును నియమించారు.



మంగళంపాడులో దుక్కిదున్ని సిద్ధం చేసిన పొలం - ఇలుపూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఎడగారు సాగు... ముమ్మరంగా వరినాట్లు

సూళ్లూరుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. బోర్ల కింద ఆయకట్టు పొలాల్లో ఏప్రిల్ మొదటి వారంలోనే నారుపోసి పొలాలను దుక్కిదున్ని నాట్లకు సిద్ధం చేశారు. సూళ్లూరుపేట మండలంలోని మంగానెల్లూరు, మంగళంపాడు, ఇలుపూరు, దామానెల్లూరు, సుగ్గపల్లి, వెలగలపొన్నూరు, సుద్దమడుగుతాగేలి, కోటపోలూరు, సామంతమల్లాం, వడమటి కండ్రిగ గ్రామాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 3 వేల ఎకరాల్లో 1010 రకం వరినాట్లు వేస్తున్నారు. తెలుగుగంగ నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తే చెరువుల కింద ఆయకట్టులో కూడా వరిసాగు చేసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పథకం ప్రకారమే టీడీపీ నేత గురుమూర్తి హత్య

నలుగురి అరెస్టు ● డీఎస్పీ చెంచుబాబు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే టీడీపీ నేత గురుమూర్తిని హత్య చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గురుమూర్తి స్వగ్రామమైన ఓజిలి మండలం అత్తివరంలో ఇటీవల రెండు వర్గాల మధ్య వివాదం జరగడంతో కేసులు నమోదయ్యాయి. గురుమూర్తి ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్న కక్షతో ఆయన ప్రత్యర్థులు హత్యకు పథకం రచించారు. అత్తివరం గ్రామానికి చెందిన మల్లి చెందు, మల్లి శ్రీనివాసులు, మల్లి శరత్, వీరి సమీప బంధువైన నెల్లూరుకు చెందిన యలమల సాయి కలిసి హత్యకు ప్రణాళిక రూపొందించుకున్నారు. పదిరోజుల నుంచే గురుమూర్తిని వెంబడిస్తూ వచ్చారు. ఏప్రిల్ 27వ తేదీ రాత్రి గురుమూర్తి, అత్తివరం గ్రామానికే చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటరు సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి వెళుతుండగా వారిని ఓ నిందితుడు బైక్‌పై వెంబడించారు. మరో ముగ్గురు మినీ వ్యానులో బయలుదేరారు. నాయుడుపేట మండలం ద్వారకాపురం సమీపంలో వెళుతున్న గురుమూర్తి మోటరు సైకిల్‌ను మినీవ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో గురుమూర్తి మినీవ్యానులో ఇరుక్కోవడంతో అర కిలోమీటరు వరకు రోడ్డుమీద ఈడ్చుకుంటూ వెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆయన మృతిచెంది వ్యానుకు ఇరుక్కుపోవడంతో వాహనాన్ని అక్కడే వదిలేసి నిందితులు పారిపోయారు. తన తండ్రిని పథకం ప్రకారమే హత్య చేశారని గురుమూర్తి కుమారుడు గురుతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు మల్లి చందుకుమార్, మల్లి శ్రీనివాసులు, మల్లి శరత్, యనమల సాయిలను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ వెల్లడించారు. అలాగే నిందితుల నుంచి మినీ వ్యాన్, మోటరు సైకిల్, స్క్రూడ్రైవర్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

అధికారుల కనుసన్నల్లోనే ఇసుక, గ్రావెల్ మాఫియా: చింతా



ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సూళ్లూరుపేట, మే 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా పోలీస్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి పెరిగిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పనులు చేయకుండా మాయ మాటలు చెప్తున్నాయన్నారు. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరికే దుగరాజపట్టణం పోర్టు, మన్నవరం బెల్ కంపెనీ పనులు ప్రారంభించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2015లో ప్రధాని మోదీ అమరావతి శంకుస్థాపనకు వచ్చి చెంబునీళ్లు, మట్టి ఇచ్చాడని, ఇప్పుడు రెండోసారి వచ్చి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు దగ్గ తగ్గేందుకు విక్స్ బిళ్లలు ఇచ్చి యోగా గురించి మాట్లాడి వెళ్లాడే తప్ప రాజధానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. సూళ్లూరుపేట తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని, అధికారులు అధికార పార్టీ నాయకులకు దాసోహంగా మారిపోయారన్నారు. గూడూరు వద్దనున్న సిలికా, కాళంగి, స్వర్ణముఖిలో ఇసుక, గ్రావెల్ తవ్వకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, గాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కురుగొండ్లకు సన్మానం


ఎమ్మెల్యే కురుగొండ్లను శాలువాతో సత్కరిస్తున్న నాగేశ్వరావు

వెంకటగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు నెల్లూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వెంకటగిరికి విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి తనకు పదవి వచ్చేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీరం రాజేశ్వరావు, చెలికం మధుసూదన రెడ్డి, గొల్లగుంట వెంకటముని, చాట్లముని రత్నం, భాస్కర్‌రెడ్డి, తోటా రామచంద్రయ్య, కూని రవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

వాటర్‌షెడ్ అభివృద్ధి, జీవనోపాధిపై శిక్షణ

తడ, మే 3 (ఆంధ్రజ్యోతి): పులికాట్ పరిధిలో వాటర్‌షెడ్ అభివృద్ధి, జీవనోపాధిపై అవగాహన సదస్సు జరిగింది. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పులికాట్ రేంజర్ నరసింహారావు మాట్లాడుతూ వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలు సమాజానికి, రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. మత్స్య సంపదను పెంచడం ద్వారా వారి జీవనోపాధి మెరుగవుతుందని చెప్పారు. వార్షిక కార్యచరణ ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘురెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, యూఎన్‌డీపీ డాక్టర్ యశ్వంత్, రామపురం సర్పంచ్ శ్రీనివాసన్, వ్యవసాయ అధికారి కిరణ్, వెలుగు ఏపీఎం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేంజర్ నరసింహారావు

కుప్పలు కుప్పలుగా చనిపోయిన కోళ్లు

కొణ్ణంబట్టులో కలకలం

సూళ్లూరుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టుకు వెళ్లే రోడ్డు పక్కన చనిపోయిన కోళ్ల కుప్పలు కుప్పలుగా పడి వుండటాన్ని శనివారం ఆ గ్రామస్తులు గుర్తించారు. సూళ్లూరుపేటలో చికెన్ దుకాణాలు నిర్వహించే వారు చనిపోయిన కోళ్లను శుక్రవారం రాత్రి వాహనంలో తీసుకెళ్లి పడేసినట్లు చెబుతున్నారు. అయితే పెద్దసంఖ్యలో కోళ్లు ఎందుకు చనిపోయాయి.. ఏవైనా రోగాలా లేక ఇంకేమైనా జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పక్కన చనిపోయిన కోళ్లు పడేయడంతో దుర్వాసన వస్తోందని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

రూ.3 కోట్లతో లింకు రోడ్ల అభివృద్ధి

గూడూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలో లింకురోడ్ల అభివృద్ధికి నాబార్డ్, ఆర్‌డీఎఫ్ నిధులు రూ.3 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. లింకు రోడ్లను అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం

నాయుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీడీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అదనంగా 17ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు తుమ్మూరు సబ్‌స్టేషన్‌లో నూతనంగా 11కేవీ బ్రేకర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయ్‌భాస్కర్‌రెడ్డి, రఫీ, గంగాప్రసాద్, చంద్రారెడ్డి, చేవూరు చెంగయ్య, మణి, సుబ్బారావు, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు, డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలను స్మరించుకుందాం

గూడూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థ మొక్కలు నాటే కార్యక్రమాన్ని అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ ప్రారంభించారు. శనివారం మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ వర్ధంతి సందర్భంగా స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణ ప్రేమికుడు శ్యామ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

శీనయ్య కుటుంబానికి న్యాయం చేయండి

కోట, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ నారుమిట్ట గిరిజన కాలనీకి చెందిన పొన్నూరు శీనయ్య కుటుంబాన్ని ఆదుకుని న్యాయం చేయాలని శనివారం ఆ కాలనీ గిరిజనులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గత నెలలో మోటర్ బైక్ ఢీకొని శీనయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబం వీధిన పడిందన్నారు. నిరుపేద అయిన శీనయ్య కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఓసూరమ్మ కొలుపు ఉత్సవాలకు

ఎమ్మెల్యే రూ.లక్ష వితరణ

నాయుడుపేట టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన భీమవరంలో నిర్వహించనున్న ఓసూరమ్మ కొలుపు ఉత్సవాలకు ఎమ్మెల్యే విజయశ్రీ రూ.లక్ష విరాళం అందజేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి భీమవరం గ్రామస్తులకు నగదును సర్పంచు అమృత సరళతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, గంగాప్రసాద్, గోను బాబు, తుపాకుల కన్నెమ్మ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో వల్లిపేడు విద్యార్థిని ప్రతిభ


హారిక, ఉద్యార్థి మల్హోత్రా, పార్థివకృష్ణ

చిల్లకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వల్లిపేడు గ్రామానికి చెందిన పార్థివకృష్ణ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభచాటింది. తిరుపతిలోని వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతున్న పార్థివకృష్ణ ఉత్తరప్రదేశ్ లోని అయోధ్యలో శనివారం జరిగిన జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ లీగ్ పోటీల్లో హైదరాబాద్ యూనివర్శిటీ జట్టుపై విజయం సాధించి క్వాటర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ జట్టులో పార్థివకృష్ణతో పాటు హారిక, ఉద్యార్థి మల్హోత్రా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిలో దొడ్లవారిమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వెళ్తున్న లారీని అదే వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమా దంలో కారులో ప్రయాణి స్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ భిక్షగాడు మరణించాడు. శనివారం ఉదయం మృత దేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో సీఐ రమణ అంత్యక్రియలు నిరహించి మానవత్వం చాటుకున్నారు. ఆయనను పలువురు ప్రసంశించారు.

8న మెగా జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్), మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీనగర్‌లోని గీతం స్కూల్‌లో ఈనెల 8వ తేదీన మెగా జాబ్‌మేళా జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో కలిసి ఆయన జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీల్లో 700కు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. హాజరయ్యే యువతీ యువకులు సంబంధిత లింక్‌లో ఈ నెల 7వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8143576866, 9177508279లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, డీఐసీ జనరల్ మేనేజరు సుధాకర్, ఏపీఐఐసీ జడ్‌ఎం విజయభరత్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాక్ శాస్త్రి కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్శిటీ నిర్వహించే ప్రాక్ శాస్త్రి (ఇంటర్ తత్సమాన) కోర్సు నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి టెన్త్ అర్హతగా నిర్ణయించారు. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేదు. దరఖాస్తులను పరిశీలించి నేరుగా అడ్మిషన్లు నిర్వహిస్తారు. దరఖాస్తుకు జూన్ 6వ తేదీ చివరి గడువుగా విధించారు. సమగ్ర సమాచారం కోసం ఎన్ఎస్‌కెటీయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ చూడవచ్చునని వర్శిటీ అధికారులు తెలిపారు.

గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు)లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3వ తరగతిలో 40 ఖాళీలు ఉండగా అందులో ఎస్సీ 32, ఎస్టీ 5, బీసీ 2, ఓసీ 1, 4వ తరగతిలో 40 ఖాళీలుండగా ఎస్టీలు 40, 5వ తరగతిలో 30 ఎస్టీలు, 6వ తరగతిలో 28 ఎస్టీలు, 7వ తరగతిలో 6 ఎస్టీలు, 8వ తరగతిలో 9 ఎస్టీలు, 9వ తరగతి లో 1 ఎస్టీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంరక్షకుల సంవత్సర ఆదాయం రూ.లక్ష మించకూడదన్నారు. దరఖాస్తులు ఎక్కువ వస్తే లాటరీ పద్ధతి ద్వారా 30వ తేదీన ఉన్నతాధికారులు నిర్ణయిస్తారన్నారు. వివరాలకు నెం.9652308420, 9247630031 లలో సంప్రదించాలన్నారు.

ఏకలవ్య గురుకులంలో మిగులు సీట్లకు...

బుచ్చినాయుడుకండ్రిగ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మిగులు సీటల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు. బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీలో భాగంగా 7, 8 9 తరగతులు, ఇంటర్ మొదటి సంవత్సరం బాలురు, బాలికల సీట్లు ఉన్నాయన్నారు. ఈ బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం ఈనెల 11న పాఠశాలలో పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హత ఉన్న గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తుడా నిధులు కేటాయించండి


తుడా వైస్‌చైర్మన్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే

వరదయ్యపాళెం, మే 3(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని తుడా వైస్ చైర్మన్ మౌర్యను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శనివారం తిరుపతిలో ఆమెను మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కలిశారు. వరదయ్యపాళెంలో వర్షాల కారణంగా ఏటా రహదారులు జలమయమై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. మురుగుకాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సత్యవేడు మండలంలో వానెల్లూరులో 18 ఎకరాలను కొనుగోలు చేసి పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నారాయణవనంలో ఏకోపార్కు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అరణియార్ ప్రాజెక్టులో పర్యాటక అభివృద్ధికి అదనంగా మరో రూ.40లక్షలు మంజూరు చేయాలని కోరారు. సత్యవేడులో అంబేడ్కర్ ఉద్యానవనం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే ఆహ్వానించారు. నిధుల మంజూరుకు కృషి చేస్తామని తుడా వైస్ చైర్మన్ హామీ ఇచ్చారు.

బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి ఘన నివాళులు


బొజ్జల సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, మే 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డికి శనివారం కుటుంబ సభ్యులు ఆయన సమాధి వద్ద ఘన నివాళులర్పించారు. గోపాల కృష్ణారెడ్డి సంవత్సరిక తిథి కావడంతో ఆయన సమాధి వద్ద కుటుంబసభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ మాట్లాడుతూ... తన తండ్రి నియోజకవర్గ అభి వృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన బాటలోనే తాను కృషి చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సీవీ జన్మదిన వేడుకలు


ఎస్సీవీ నాయుడిని సన్మానిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు 70వ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద పార్టీలకు అతీతంగా శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, సూళ్లూరుపేట, తిరుపతి నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళ హస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ సభ్యుడు నారాయణయాదవ్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. పలువురు మాట్లాడుతూ ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపు కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురుదశరథన్, ఇర్ల కిషోర్, బాలాజీనాయుడు, హరినాయుడు, ఎం.గణేష్, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై అగస్త్యేశ్వరస్వామి విహారం



నారాయణవనం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయం మరగదవల్లి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందు భాగంగా శనివారం రాత్రి స్వామిఅమ్మవార్లను హంస వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతరప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ హంస వాహన సేవ జరిగింది. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, ఆలయ అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఊంజల సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం దేవేరుల సహా స్వామివారి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకన్న ఊంజల సేవ ను నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఉదయం నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జీ గది నుంచి కమీషన్ రాలేదని....

రెచ్చిపోయిన ఇద్దరు యువకులు ● అన్నదమ్ములపై దాడి

శ్రీకాళహస్తి, మే 3(ఆంధ్రజ్యోతి): లాడ్జీలో భక్తులు అద్దెగదిని పొందడం ద్వారా తమకు కమీషన్ రాలేదని ఇద్దరు యువకులు రెచ్చిపోయారు. తమకు అడ్డు తగిలారన్న ఆగ్రహంతో ఇద్దరు అన్నదమ్ములపై దాడి చేశారు. బాధితుల కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన నవీన్ ముక్కంటి ఆలయ 1వ గోపురం వద్ద టెంకాయల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఇతని తమ్ముడు హరికృష్ణ 1వ గేటు సమీపంలోని ఓ లాడ్జీలో మేనేజరు. పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు 1వ గోపురం వద్ద నిలబడి అక్కడికి వచ్చిన భక్తులకు లాడ్జీ గదులను చూపుతూ నిర్వాహకులనుంచి కమీషన్ పొందుతుంటారు. శుక్రవారం రాత్రి తమిళనాడు నుంచి రెండు కుటుంబాల భక్తులు 1వ గేటు నుంచి లోపలకు వెళ్లారు. అక్కడ టెంకాయల దుకాణం వద్ద ఉన్న నవీన్‌ను అద్దె గదులు ఎక్కడ ఉన్నాయని అడిగారు. దాంతో నవీన్ సమీపంలో ఉన్న ఓ లాడ్జీని చూపడంతో వారు అక్కడ కమీషన్ లేకుండా తక్కువ ధరతో రెండు అద్దె గదులను తీసుకున్నారు. కాసేపటి తరువాత టెంకాయల దుకాణం వద్దకు వచ్చిన ఇద్దరు యువకులు తమిళనాడు భక్తులకు లాడ్జీలకు వెళ్లే దారిని తామే చూపామని కమీషన్ లేకుండా లాడ్జీలో నేరుగా మీ తమ్ముడు గదులను ఇచ్చాడని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది.

శనివారం రాత్రి మళ్లీ దళారీలుగా వ్యవహరించే యువకులు నవీన్ వద్దకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో నవీన్‌తో పాటు పక్కనే ఉన్న హరికృష్ణపై యువకులు దాడి చేసి పరారయ్యారు. గాయపడిన సోదరులు 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. దాడికి పాల్పడిన వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు

ముసలిపేడు వంతెన కిందే తోడుతున్న వైనం ● గ్రామస్తుల సమాచారంతో అక్రమార్కులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


వంతెన కింద ఇసుకను తోడుతున్న అక్రమార్కులను అడ్డుకుంటున్న రైతులు

ఏర్పేడు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిపేడు- శ్రీకాళహస్తి మార్గంలో ఉన్న వంతెన కింద స్వర్ణముఖి నదిలో అక్రమార్కులు గత నాలుగు రోజులుగా ఇసుకను తోడి తరలిస్తున్నారు. ఈ వంతెనపై ముసలిపేడు నుంచి పాపానాయుడుపేట వరకు సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే అలాంటి స్వర్ణముఖి నది వందెన కింద ఏకంగా ఇసుకాసురులు ఇసుకను తవ్వి తరలిస్తుండడంతో వంతెన బలహీన పడి వరాకాలంలో కూలిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక రైతులు, పలుగ్రామాల ప్రజలు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల రెవెన్యూ అధి కారులు శని వారం ఘటనా స్థలానికి చేరుకుని ఇసుకాసురులను అడ్డుకున్నారు. వంతెన కింద ఇసుకను తోడితే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. వంతెన సరిహద్దు మార్గంలో స్వర్ణముఖి ప్రాంతంలో ఎక్కడా ఇసుకను తవ్వినా ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. ఏర్పేడు తహసీల్దారు భార్గవి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వంతెన వద్ద నదిలోకి వెళ్లకుండా కందకం తవ్వించారు.

వెల్డింగ్ చేస్తూ... బాయిలర్‌లో పడి కార్మికుడి మృతి

సత్యవేడు, మే 3 (ఆంధ్రజ్యోతి): కంపెనీలో వెల్డింగ్ పనులు చేస్తూ కార్మికుడు మృతి చెందాడు. సత్యవేడు ఎస్‌ఐ ఓ.రామస్వామి తెలిపిన వివరాలు... ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఫరాన్ (22) మండలంలోని పాలగుంటలో ఉన్న స్పెరీ థర్మాకోల్ కంపెనీలో వెల్డర్. శుక్రవారం రాత్రి కంపెనీలోని బాయిలర్ మరమ్మతులకు గురి కావడంతో వెల్డింగ్ చేసేందుకు పైకి ఎక్కాడు. వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి బాయిలర్‌లో పడి పోయాడు. సహచర కార్మికులు ఫరాన్‌ను బాయిలర్ నుంచి వెలికి తీయగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సత్యవేడు పోలీసులు కంపెనీకి చేరుకుని మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్ప త్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

జడ్జి వెంకట నాగరాజు

సత్యవేడు, మే 3 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, అడ్మిన్, బ్యాంకు కేసులు పరిష్కరించుకోవచ్చని సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకటనాగరాజు తెలిపారు. శనివారం కోర్టు ఆవరణలో ఆధ్వర్యంలో జూలై 7న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నిర్వాహణపై సంబంధిత పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఇరు వైపులా కక్షిదారులకు అవగాహన కల్పించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీపీ లత, శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, ఎస్‌ఐలు రామస్వామి, సునీల్, మల్లికార్జున, వెంకటరమణ, హరిప్రసాద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషిన్ల పంపిణీ



ఏర్పేడు మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవరం పిళ్లారిగుంట ఎస్టీ కాలనీలో శనివారం రవిరాల్లా స్పెయిన్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో షేర్ జీసెస్ వరల్డ్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు జోసెఫ్ కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. వీరికి మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు అంపాళెం ఈశ్వరరెడ్డి, కార్యదర్శి వెంటకరత్నం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వెంకటరత్నమ్మ



బుచ్చినాయుడుకండ్రిగ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వెంకటరత్నమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నాగలాపురం మండల పరిషత్‌లో ఈవోపీఆర్డీగా పని చేస్తున్న వెంకటరత్నమ్మ పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇదే కార్యాలయంలో ఏవో త్రివిక్రమ్‌రావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేశారు.

అర్బన్ విద్యుత్ కార్యాలయం మార్పు

రేణిగుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ అర్బన్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మారుస్తున్నట్టు డీఈఈ రమేష్ బాబు తెలిపారు. గుంటకట్ట వద్ద ఉన్న కార్యాలయం దెబ్బ తినడంతో నూతన భవనం నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. అంతవరకు రామకృష్ణాపురం సమీపంలో ఉన్న పాత డీఈఈ కార్యాలయంలో వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని డీఈఈ తెలిపారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట,మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన స్వామివారు పద్మావతి, ఆండాళ్ సమేతుడై మేళాతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారతలిచ్చారు. ఆలయ అధికారి శివకుమార్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హంస వాహనంపై సదాశివుడి దివ్యస్వరూపం



పుత్తూరు టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి అమ్మవార్లు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యపూజా కైంక ర్యాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 7.30 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి హంస వాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


ఉద్యోగాలు పొందిన యువతతో ఉమామహేశ్వర్ తదితరులు

పుత్తూరు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోవిందపాళెం సమీపంలో ఉన్న శ్రీవిద్యా కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. శనివారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన మేళాలో 30 బహుళజాతి సంస్థలు పాల్గొన్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. మొత్తం 530 మంది హాజరయ్యారు. ఇందులో 212 మంది ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నట్లు ఫౌండేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకట ప్రసాద్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యం, హరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


కేశవులు (ఫైల్‌ఫొటో)

వరదయ్యపాళెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమత్తూరులో శనివారం ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరా లు... శుక్రవారం ఉదయం 8 గంటలకు కేశవులు(65) ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా 10 గంటల ప్రాంతంలో ఉన్నట్లుండి కుప్పకూలాడు. సహచర కూలీలు పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. గుండెపోటుగా భావిస్తున్నారు. సర్పంచ్ ప్రవీణ సమాచారం మేరకు పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు.

6నుంచి చిన్నకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 6 తేదీ నుంచి 12వ తేదీ వరకు చిన్నకొట్టాయి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. 6వ తేదీ సోమవారం నుంచి ప్రతిరోజు సాయంత్రం 7గంటలకు జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అలంకార మండపం నుంచి బయలు దేరి ఆవరణలోని పొగడమాను చెట్టు వద్దకు వేం చేస్తారన్నారు. పూజల అనంతరం ప్రధాన ఆలయానికి చేరుకుంటారని తెలిపారు. చివరిరోజు మాడవీధుల్లో గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

ఎంపీడీవోకు అస్వస్థత

సత్యవేడు, మే 3 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా అధిక రక్తపోటుకు గురయ్యారు. సిబ్బంది ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. కాగా ఎం పీ డీ వో అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆది మూలం స్విమ్స్‌కు చేరుకుని ఆయన్ను పరామర్శించారు.